క్లుప్తంగా

రోడ్డు వేయాలని గ్రామస్తుల ధర్నా



వెంకటాపూర్(ఎం): కంకర రోడ్డుతో ఇబ్బంది పడుతున్నాము.. రోడ్డు వేయాలంటూ మండలంలోని ఇంచేంచెర్వుపల్లి గ్రామస్తులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. జాకారం నుంచి గ్రామానికి బీటీ రోడ్డు మంజూరైనప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ కంకర పోసి వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. 108 అంబులెన్స్ సైతం కంకర రోడ్డుపై వచ్చే పరిస్థితి లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, అనారోగ్యానికి గురైన ప్రజలు ఆస్పత్రికి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి

ములుగు రూరల్: ఇందిరమ్మ ఇళ్ల మంజూరిలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని మాజీ ఎంపీటీసీ పోరిక విజయ్‌రాంనాయక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ రామకృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మదనపల్లిలో అర్హుల జాబిత ఎంపికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు విఫలమయ్యారని అన్నారు. గ్రామంలో ఇళ్లు కాలిపోయి, ఇళ్లు లేని వారిని ఎంపిక చేయకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు అందించిన లిస్టులు కాకుండా అధికారులు పరిశీలించి నిజమైన అర్హులను ఎంపిక చేయాలని అన్నారు. మదనపల్లి గ్రామానికి 80 ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పొలబోయిన చంటి, భూక్యా రాహుల్, ఆనంద్, కల్యాణ్, వినోద్, ప్రభాకర్, విజయ్, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు మంజూరు చేయండి

వాజేడు: ఇందిరమ్మ ఇళ్ల లిస్టులో పేర్లు రాగా.. అధికారులు కావాలని తొలగించారని తమకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని కోరుతూ వివిధ గ్రామాలకు చెందిన మహిళలు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయనే కారణంతో అధికారులు పేర్లు తొలగించినట్లు వారు తెలిపారు. కానీ, వారు నేటికీ పూరిగుడిసెల్లోనే నివాసం ఉంటున్నట్లు వెల్లడించారు. వినతిపత్రాలు అందజేసిన వారిలో గణపురపు నర్సు(జంగాలపల్లి), బోడెబోయిన మల్లమ్మ(మొరుమూరు), గుండెబోయిన లక్ష్మి(లక్ష్మీపురం), దళాయి శ్రీదేవి(ఎడ్జెర్లపల్లి), అట్టం చినసమ్మక్క(ప్రగళ్లపల్లి), ఇర్ప లావణ్య(చంద్రుపట్ల) ఉన్నారు.కాగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వారితో మాట్లాడారు. స్థానిక (భద్రాచలం) ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ద్వారా రెవెన్యూ, హౌజింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి



వెంకటాపురం(ఎం): రైతులు పురుగుమందులు, ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వెంకటాపురం మండల వ్యవసాయ అధికారి శైలజ సూచించారు. మండలంలోని పాలంపేట రైతు వేదికలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించేందుకు మండలంలోని రామాంజాపూర్, తిమ్మాపూర్ గ్రామాలను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. మండలంలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు సునీల్, దయానా, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

ములుగు రూరల్: లయన్స్ క్లబ్ 12వ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు లయన్స్ ఇంటర్నేషనల్ 320 ఎఫ్ గవర్నర్ లయన్ కుందూరు వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం నూతన మండల కమిటీ అధ్యక్షుడిగా దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చుంచు రమేష్, కోశాధికారిగా ఆడెపు రాజు, ఉపాధ్యక్షులుగా గంధ్రకోట సుధీర్, బోయినపల్లి శ్రీధర్‌రావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ సేవలు అందించాలని అన్నారు. నిరుపేద విద్యార్థులకు నోట్ బుక్స్, బ్యాగులు, స్టడీ మెటీరియల్స్ అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇండక్షన్ ఆఫీసర్ పద్మజ, రాజేశ్వరి, హరికిషన్‌రెడ్డి, రమణారెడ్డి, రేవతి, వనజ, రవీందర్‌రెడ్డి, రవీందర్, రఘు, అప్పయ్య, ఉదయ్‌కిరణ్, హరిచంద్రరెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

గోనె సంచులే తలుపుగా..!

అధ్వానంగా అంగన్‌వాడీలు
- కేంద్రాల్లో అంతంత మాత్రంగానే మరుగుదొడ్లు
- టాయిలెట్స్ ఉన్నా తలుపులు లేని వైనం
- ఇబ్బంది పడుతున్న టీచర్లు, ఆయాలు, చిన్నారులు

ఏటూరునాగారం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారులతో పాటు కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని మానసపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాంలోని మరుగుదొడ్డికి సరైన తలుపు లేకపోవడంతో తట్టుసంచిని అడ్డుగా కట్టుకొని అవసరాలను తీర్చుకుంటున్నారు. అంబేడ్కర్ కాలనీ, 8 వార్డు, ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని సెంటర్లలో సైతం ఇబ్బందులు ఉన్నాయి. క్రాస్‌రోడ్డులో సరైన మూత్రశాలలు లేవు. గోగుపల్లి వద్ద సరైన నిర్మాణం లేక అవస్థలు పడుతున్నారు. ఇలా అనేక మూత్రశాలలు, మరుగుదొడ్లు సక్రమంగా లేక అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



మానసపల్లి అంగన్‌వాడీ భవనం, పక్కన తలుపులు లేకపోవడంతో అడ్డంగా కట్టిన గోనెసంచి

తలుపులు అమర్చాలి



అంగన్‌వాడీ కేంద్రానికి సరైన డోర్స్ లేక ఇబ్బంది పడాల్సి వస్తోంది. డోర్ అమర్చి ఇబ్బందులు తొలగించాలి. చిన్నవర్షం కురిసినా.. మానసపల్లి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణ బురదమయంగా మారుతుంది. సిమెంట్‌తో చదును చేయించాలి. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు.

– మామిడి రజిత, మానసపల్లి

సెంటర్లను శుభ్రపర్చాలి



అపరిశుభ్రంగా ఉన్న కేంద్రాలను శుభ్రం చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలి. వర్షాకాలంలో పాములు, తేళ్లు వచ్చే అవకాశం ఉంది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు వచ్చే సెంటర్ల వద్ద వారికి తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి.

– పాగ సమ్మక్క, మానసపల్లి

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్



వాజేడు: అవగాహన కల్పిస్తున్న ఏఓ

- సీఐ అనుముల శ్రీనివాస్

ఏటూరునాగారం: డివిజన్ పరిధిలోని రైతులు నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో రైతులు, వ్యవసాయ అధికారులతో నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులు నకిలీ విత్తనాలతో మోసపోకుండా ఉండేందుకు టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్, ఎస్సై తాజొద్దీన్‌తో కలిసి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వ్యాపారులు, సంస్థలు, వ్యక్తులు రైతన్నను మోసం చేస్తూ నకిలీ విత్తనాలను, పురుగు మందులు విక్రయిస్తుతే పీడీ యాక్ట్ కేసులు తప్పవని హెచ్చరించారు. నకిలీ విత్తనాలను విక్రయాలను నియంత్రియించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో నిఘా పటిష్టం చేసినట్లు తెలిపారు. ఇకపై ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే తక్షణమే స్థానిక పోలీసులకు లేదా 100 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు

మంగపేట: మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ధరణి, లక్ష్మీప్రసన్న, మన గ్రోమోర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆయా షాపుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎరువులు, పురుగు మందుల విక్రయాలను ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించాలని చెప్పారు. అనంతరం రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో సీఐ రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఓ చేరాలు, ట్రెయినీ ఎస్సైలు టీవీఆర్ సూరి, శ్రీకాంత్, టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

వాజేడు: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలను తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి ముంజ మహేశ్ హెచ్చరించారు. ధర్మవరం, చెరుకూరు గ్రామాల్లోని విత్తన దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విత్తనాలు ఎక్కడ కొనుగోలు చేశారు.. అందుకు సంబంధించిన పత్రాలు, తయారీ తేదీ, ముగింపు తేదీలను పరిశీలించారు. పేరూరు రైతు వేదిక వద్ద రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ హరీశ్ తదితరులు ఉన్నారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారులకు అవగాహన కల్పిద్దాం

- ఎంపీడీఓ శ్రీకాంత్‌నాయుడు

వాజేడు: మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు క్లస్టర్ వారీగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేరూరు, చెరుకూరు రైతు వేదికల్లో బుధవారం, నాగారంలో శుక్రవారం ఈ అవగాహన సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పేరూరు, అయ్యవారిపేట, చంద్రుపట్ల, కృష్ణాపురం, ధర్మవరం గ్రామ పంచాయతీల లబ్ధిదారులను పేరూరు రైతు వేదిక వద్దకు, చెరుకూరు, చీకుపల్లి, చింతూరు, పెద్దగొల్లగూడెం గ్రామ పంచాయతీల లబ్ధిదారులను చెరుకూరు రైతు వేదికకు, ఈ నెల 13న దూలాపురం, ఏడ్జెర్లపల్లి, మొరుమూరు, గుమ్మడి దొడ్డి, పూసూరు గ్రామ పంచాయతీల లబ్ధిదారులను నాగారం రైతు వేదికకు తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం ఉపాధి హామీ పథకం పనులపై చర్చించారు.



మాట్లాడుతున్న శ్రీకాంత్‌నాయుడు

అనర్హులను తొలగించాలి

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు లిస్టులో అనర్హుల పేర్లను తొలిగించి అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేయాలని రాజుపేట మాజీ ఎంపీటీసీ కొమరం ధనలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పలు గ్రామాల్లో 10 నుంచి 15 ఎకరాలకు పైగా భూములు, కార్లు, ట్రాక్టర్లు, బిల్డింగులు ఉన్న వారు, ఒక కుటుంబంలోనే ముగ్గురికి పైగా ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వం, అధికారులు స్పందించి గ్రామాల్లో అనర్హుల పేర్లను తొలిగించి అసలే ఇళ్లులేని నిరుపేదలకు ఇవ్వాలన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

- బొల్లు దేవేందర్

ఎస్ఎస్ తాడ్వాయి: ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా మంజూరు అవుతాయని తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతాయన్నారు. మంత్రి సీతక్కకి దక్కుతున్న మంచి పేరును చూసి ఓర్వలేని నాయకులు కుటిల రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అవినీతి జరిగితే నిరూపించాలన్నారు. కార్యక్రమంలో సంపత్ గౌడ్, లచ్చు పటేల్, పాక సాంబయ్య, ముజఫర్, సునీల్, రామయ్య, సిద్దిరెడ్డి, జగన్, మధు, నరసింగరావు తదితర నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

అనర్హులకు ఇళ్లు కేటాయించారు..

- మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి

ఎస్ఎస్ తాడ్వాయి : కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిమ్మ ఇళ్ల మంజూరులో అనర్హులని ఎంపిక చేసిందని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కాటాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరిలో అంకంపెల్లి గ్రామ పంచాయతీ, గవర్నర్ దత్తత తీసుకున్న కొండపర్తి గ్రామాలు మినహా మిగతా గ్రామపంచాయతీల్లో అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయకుండా అనర్హులను, కాంగ్రెస్ కార్యకర్తలకు మంజూరు చేశారని అన్నారు. ఈ విషయంపై అవసరమైతే బహిరంగ చర్చకు కూడా సిద్ధమని పేర్కొన్నారు. మేడారం జంపన్నవాగు నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసమే ఇసుక తరలిస్తున్నామని ప్రచారం చేస్తున్నారే తప్ప వాస్తవంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాకముందే వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలింపు చేస్తుండడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇసుక అక్రమ తరలింపును అడ్డుకున్న తహసీల్దార్ గిరిబాబును బదిలీ చేసింది వాస్తవం కాదా.. అని అన్నారు. కాంగ్రెస్ ప్రజలకు చేస్తున్న మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండకడతామన్నారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ లాలయ్య, మాజీ సర్పంచ్ గౌరమ్మ, నాయకులు నర్సింగారావు, దూశెట్టి రమేష్, వహీద్, శోభన్, వెంకటేశ్, రాంబాబు, తిరుపతి, రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. ఈ మేరకు మంగళవారం వికసిత్ భారత్ అమృత కాలం సేవ సుపరిపాలన, పేదల సంక్షేమంపై మండల అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ ప్రతిష్ట అంతర్జాతీయ స్థాయికి పెరిగిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో 4వ స్థానానికి నిలబెట్టారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో దేశ దౌత్యసామర్థ్యం నిరూపితమైందని అన్నారు. గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, కృష్ణాకర్, రవిరెడ్డి, వాసుదేవరెడ్డి, శ్రీహరి, రవిందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ గర్వ కారణం

గోవిందరావుపేట: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం భారతీయులకు గర్వకారణమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. మండల పరిధిలోని పస్రా గ్రామంలో మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు మార్క సతీష్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిరికొండ బలరాం హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ దేశాన్ని ముందు వరుసలో ఉంచాలనే ప్రయత్నంలో భాగంగా నేడు 4వ అతిపెద్ద ఆర్థిక దేశంగా అవతరించిందన్నారు. భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం గర్వంగా ఉందని తెలిపారు. క్రిష్ణాకర్, రవీందర్ రెడ్డి, విజయలక్ష్మి, బాబురావు, అశోక్, సత్యనారాయణ, రాజన్న నాయక్, సాంబశివరావు, పాండు, మంజ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పించండి



వాజేడు: బడి బాటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



ఏటూరునాగారం: అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో టీచర్లు

- కొనసాగుతున్న బడిబాట
- పాల్గొంటున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు

వాజేడు: ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు అన్నారు. వాజేడు ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నాగారం, కాచారం, జంగాలపల్లి గ్రామాల్లో జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామాల్లోని ఇంటింటిని సందర్శించి ప్రభుత్వ బడుల్లో ఉన్న సౌకర్యాలు, పిల్లలకు అందించే విద్యా విధానాన్ని వివరించారు. ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరుతూ వినతి పత్రాలను ఇవ్వడంతోపాటు విద్యార్థుల వివరాలను నమోదు చేసుకున్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

ఏటూరునాగారం: తల్లిదండ్రులు వారి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలని టీచర్లు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో తీగలవాయి-1 సెంటర్ అంగన్‌వాడీ టీచర్ ఇర్సవడ్ల సరోజ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సరోజ మాట్లాడుతూ.. ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు బడిబాటను కొనసాగించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు మూడు నుంచి ఆరు సంవత్సరాలలోపు చిన్నారుల పేర్లను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నమోదు చేయించాలన్నారు. చిన్నారులకు ఆటపాటలతో విద్యను బోధించడమే కాకుండా సంపూర్ణ ఆహారాన్ని ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తీగలవాయి-2 ప్రాంతానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ చిటమట వసంత, ఓడవాడ-1 అంగన్‌వాడీ టీచర్ లలిత కుమారి ఆయా రోజా, చిన్నారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ మాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి సూపర్‌వైజర్ శ్రీవిద్య హాజరై ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. గర్భిణులు బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి వచ్చే పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో శివాలయం వీధి సెంటర్ టీచర్ తరంగిణి, గొల్లవాడ టీచర్ పద్మలత, బెస్తవాడ-1 రాజేశ్వరి, ఓడవాడ-2 శ్రీలత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బడిబాట

కన్నాయిగూడెం: మండలంలోని ప్రతీ గ్రామంలో 3 నుంచి ఐదేళ్ల పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఏటూరునాగారం సీడీపీఓ ప్రేమలత అన్నారు. మండలంలోని ఐలాపుర్ గ్రామంలో సూపర్ వైజర్ పుష్పవతి అధ్యక్షతన మంగళవారం బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ప్రేమలత మాట్లాడారు.

సంక్షిప్త సమాచారం..

ఎస్సైని సన్మానించిన తహసీల్దార్

వాజేడు: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్ సీఎం చేతుల మీదుగా గ్యాలంటీరీ అవార్డును అందుకున్నారు. ఈనేపథ్యంలో ఎస్సై కృష్ణ ప్రసాద్‌ను మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ కుమారస్వామి, నాగరాజు, రాంబాబు తదితరులు ఉన్నారు.

కొండాయి బ్రిడ్జి పనుల పరిశీలన

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి వద్ద జంపన్నవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం కోసం మంత్రి సీతక్క ప్రభుత్వం ద్వారా రూ.16.50 కోట్లు మంజూరు చేయించినట్లు రఘు తెలిపారు. పనులు వేగంగా, నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వంగపండ్ల రవి, ఖలీల్, గౌస్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

ములుగు రూరల్: మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఎస్సై వెంకటేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడిన 120 మందికి ములుగు మేజిస్ట్రేట్ రూ.1,59,200 జరిమానా విధించినట్లు తెలిపారు. ఆరుగురికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించినా.. మద్యం సేవించి వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రెవెన్యూ సదస్సును వినియోగించుకోవాలి

వాజేడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని సొసైటీ అధ్యక్షుడు యగ్గడి అంజయ్య అన్నారు. మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాస్, పేరూరులో గ్రామంలో ఆర్ఐ కుమారస్వామి మంగళవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను తెలుపుతూ ఇచ్చిన వినతి పత్రాలను అందించారు. మంగళవారం భారీ సంఖ్యలో 272 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

వాజేడు: మండల పరిధిలోని ఏడ్జెర్లపల్లి, బొమ్మనపల్లి, ధర్మవరం గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ మూడు గ్రామాల్లోని ప్రజలను ప్రగళ్లపల్లి పల్లె దవాఖాన వైద్యాధికారి గ్నానస, పేరూరు వైద్య సిబ్బంది పరీక్షించారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలు రాకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమలను అరికట్టడం మూలంగానే జ్వరాలు రాకుండా ఉండొచ్చని వివరించారు. ఎలాంటి అనారోగ్యానికి గురైనా ప్రభుత్వ ఆస్పత్రి రావాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో తిరుగుతూ జ్వరాల తీవ్రత తెలుసున్నారు. కార్యక్రమంలో కోటిరెడ్డి, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో ఈ నెల 12న చేపట్టే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమంలో చంద్రయ్య, రాంబాబు, దేవేందర్, లచ్చు పటేల్, సునీల్, రాజశేఖర్, శ్రీకాంత్, శ్రీను, సమ్మయ్య పాల్గొన్నారు.

నిరుపేద వృద్ధురాలికి చేయూత

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన అనుము సమ్మక్క ఉండటానికి సరైన ఇల్లు లేని దినస్థితిలో జీవిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ సభ్యులు ఆమె ఇంటికి వెళ్లి పరిశీలించారు. ఆమె పరిస్థితి ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ గ్రూప్ లో వివరించగా దాతలు ముందుకొచ్చి ఆమెకు చేయూత అందించారు. దీంతో మంగళవారం విద్యుత్ సామగ్రి, నిత్యావసర వస్తువులు, టేబుల్ ఫ్యాన్, అంజేసినట్లు బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు వహిద్ తెలిపారు. మహమ్మద్ మున్నా, జగన్నాథం, నాగసాగర్, గద్దల చరణ్, అరవింద్, రాజేష్, జానకి, రాజేష్, రెడ్డి రోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఏటూరునాగారం: మండల కేంద్రంలో ఇటీవల మరణించిన కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు ముగ్గురు బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ నాయకుల ద్వారా రూ.17,500 మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్‌రావు, మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, తాడూరి రఘు, ఖాజాపాషా, మల్లారెడ్డి, భాస్కర్‌రావు, చంద్రబాబు, నర్సయ్య, పుల్లయ్య, ఖలీల్, ముత్తయ్య, చంద్రం, శ్రీరామ్, ఎల్లయ్య, యశ్వంత్, తిరుపతి పాల్గొన్నారు.

ఘనంగా నిర్వహించుకోవాలి

వెంకటాపురం(కె)/వాజేడు: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ చాతాళ్ల రమేష్ అన్నారు. మంగళవారం వెంకటాపురం, వాజేడులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 7న నిర్వహించే వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తోకల శివ, స్వామి, శ్యామ్, మనోజ్, చంటి, వెంకటేశ్వర్లు, రమేష్, సందీప్, ఆదినారాయణ, రాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కన్నాయిగూడెం: ముప్పనపల్లి కేజీబీవీ జూనియర్ కళాశాలలో తాత్కాలిక పద్ధతిలో బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ అశ్విని మంగళవారం ప్రకటనలో తెలిపారు. ముప్పనపల్లి కేజీబీవీని అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్, మాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ, జువాలజీలకు సబ్జెక్టుకు ఒకరు చొప్పున ఖాళీలు ఉన్నాయని, ఇంగ్లిష్ మీడియంలో బీఈడీ లేదా పీజీ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 91216 06721 నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు..

ములుగు రూరల్: హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడలశాఖ అధికారి సర్దార్‌సింగ్ మంగళవారం ప్రటనలో పేర్కొన్నారు. జూన్ 15వ తేదీ వరకు www.tgss.telangana.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 73303 26241 నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.